# జ్వలించిన శిల

"ఆ చివర టేబిలు చూడు, అక్కడ కూచున్న మనిషి నాకు ఎంతో బాగా తెలుసు" అన్నాడు మహేంద్ర.

"ఔను, యీ మధ్యనే కనుపిస్తున్నాడు యీ హొటల్లో. మోటారు డీలరు అనుకుంటాను. కారు దిగుతోంటే చూశాను. దర్జాగా వున్నాడు సుమా!" అన్నాడు మిత్రుడు.

"తెలుగు వాడు కాదు, అరవపయ్యన్. పేరు గౌతమ్" అన్నాడు ఆవేపే చూస్తూ మహేంద్ర.

గౌతమ్ కార్ల డీలరు. అతని భార్య అహల్య. బ్యాంకిలో ఆఫీసరు. ఐదారేళ్ల క్రితం వాళ్లు హైదరాబాదులోనే వుండేవారు. అహల్య తెలుగు వనిత. గౌతమ్ అందగాడు. డబ్బున్నవాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

మహేంద్రకు ఎల్లాపరిచయం అంటే యితగాడు ఎంతో విలాసవంతంగా వుంటాడు. సంగీత, సాహిత్య, లలిత కళా ప్రియుడు. ప్రతి సభకూ, కచ్చేరీకి వెడతాడు. వీలున్నచోట స్టేజి ఎక్కి, కార్యక్రమంలో తనూ భాగంగా ఆర్భాటంగా తిరుగుతాడు. అవకాశం వుంటే ఉపన్యసిస్తాడు. అహల్య వాళ్లాయన గౌతమ్‌కి ఒక్కోరోజు షోరూమ్‌లో సాయంత్రం పొద్దుపోయేదాకా పని వుంటుండేది. అహల్యకి సంగీతం, సాహిత్యం, నాట్యం, నాటకాల వంటివి చాలా యిష్టం.

కాలేజీ రోజుల్లో చాలా వాటిల్లో పాల్గొనేది కూడా. సాయంత్రం ఏదో ఒక సభకి వెళ్లడం ఆరంభించింది.

ఒకనాడొక సాహిత్య గోష్టికి వెళ్లింది. అది కవి సమ్మేళనం. చాలా కాలం మదరాసులో వుండి, తెలుగుకి ముఖం వాచినట్లు ఆద్యంతం ఆ కార్యక్రమంలో లీనమైపోయింది. బయటికి వచ్చేసరికి యింకా గౌతమ్‌కానీ, కారుగానీ రాలేదని తెలిసింది. గేటు దగ్గర నిలబడినప్పుడు మహేంద్ర స్కూటర్ మీద వచ్చాడు. జనం చాలావరకు వెళ్లిపోయారు. ఆరోజు మహేంద్ర స్టేజిమీద వుండి సన్మాన కార్యక్రమంలో హడావిడిగా తిరగడం అహల్య చూసింది. అంచేత అతనిని గుర్తుపట్టింది. అతను స్కూటరు ఆపి, 'నమస్తే' అంటూ పరిచయం చేసుకొన్నాడు.

అతని కంఠస్వరం, ఉచ్చారణ, ధీమాగా హుందాగా తిరిగిన తీరు అహల్యకు బాగానే తోచాయి. "ఏమిటి, యిక్కడ నిలబడ్డారు, ఆటో కోసమా?" అని పలుకరించాడు. అహల్య మొహమాటంగా నవ్వి "మా వారు వస్తానన్నారు" అన్నది. "ఫోన్ చేసి కనుక్కోనా, నెంబరు చెప్పండి" అన్నాడు మహేంద్ర జేబులోంచి సెల్‌ఫోన్ తీస్తూ... "వద్దండీ. నాదగ్గరా సెల్ వున్నది. చేస్తాను" అన్నది.

అతను స్కూటరుని స్టాండ్ వేసి పక్కకు పెట్టి "మీకీ ప్రోగ్రాం నచ్చిందా?" అంటూ మాట కలిపాడు. ఆనాటి కవులూ, వారు చదివిన కవితలు, వాటిల్లోని నిరాశలు మొదలైన విషయాలు కొంత సేపు మాట్లాడుకున్నారు. ఆదివారం వున్న యింకొక కార్యక్రమానికి ఆహ్వానం యిచ్చాడు మహేంద్ర. అది పుష్కరావిష్కరణ సభ.

ఈలోగా గౌతమ్ వచ్చాడు. అతణ్ని క్లుప్తంగా పరిచయం చేసింది. కారు కదిలే దాకా ఆగి మహేంద్ర స్కూటరు ఎక్కాడు.

ఆవిధంగా తొలి పరిచయం జరిగింది. తరువాత సంగీతం,సాహిత్యం, నృత్య కార్యక్రమాలకి అహల్య తరచుగా వెళ్లడం ఆరంభించింది. తనేదో కొత్త ప్రపంచంలోకి వెడుతున్నట్లు సంతోషం. గౌతమ్‌కీ ఆమె అల్లా వెళ్లడం బాగానే వుంది. కారు షోరూంలో అతని బాధ్యత ఎక్కువగా ఉండటం వల్ల ఎప్పుడూ పని వత్తిడి గౌతమ్‌కు. సాయంకాలాలు తనకోసం ఎదురు చూస్తూ ఒక్కతీ కూచోకుండా, తన కాలక్షేపం తను చూసుకుంటోంది. కార్యక్రమం త్వరగా అయిపోయి, గౌతమ్‌కి పని లేటు అయ్యేట్లుంటే ఒకటి రెండు సార్లు ఆమెను మహేంద్ర యింట్లో దింపాడు కూడా.

అహల్య భావుకురాలు. పెళ్లయి నాలుగేళ్లవుతున్నా, ముప్పై ఏళ్లు దాటుతున్నా, చిగురాకులా ఆమె మనస్సు రెపరెపలాడుతుంటుంది. ఆకాశంలోని మబ్బు తునకలు ఆకారాలు మారిపోతుంటే చూస్తుంది. ఆ మార్పులకి విస్మయ పడిపోతుంటుంది. వాటి వెనుక నీలి నగరపు శోభలు ఏవో వున్నాయన్నట్లు భ్రమగా చూస్తుంటుంది. మల్లెల మత్తు వాసన గుండెనిండా నింపుకుంటుంది. భాషకాని భాష వాడైన పురుషుడు తన భర్తతో వివరంగా చెప్పలేక పోతుంటుంది. విశ్రాంతి లేని అతని జీవితంలో యీ భావుకతకి చోటు లేదనిపిస్తుంది.

ఒక విధంగా యీ వెలితిని మహేంద్ర పూర్తి చేస్తూ వచ్చాడు. అహల్య అందమైన, డబ్బున్న ఆఫీసరు. యువదశలో ఆమె మనస్సు చలిస్తున్న సంగతి ఆమె అరమోడ్పు కనులలో తెలిసిపోతుంటుంది. శృంగారం కాని ఒక ప్రణయం తన మాటలలో అతను చవి చూపిస్తున్నాడు. ఒక రాత్రి వేళ అహల్యకి నిద్ర మెలకువ వస్తుంది. అలసిన గౌతమ్ నిద్ర పోతుంటాడు. కిటికీలోంచి చూస్తే... చెట్ల ఆకుల మీద వెన్నెల తళుక్కుమంటుంటే చూస్తుంది. చిరుగాలికే తలలూపి, గింగుర్లు తిరిగి పోతున్న చిన్న మొక్కలను చూస్తే, కవితలలాంటి వుత్తరం ఒకటి వ్రాసి చదవమని మహేంద్రకు యిస్తుంది.

ఆమె అయోమయపు ఆలోచనలు, చేష్టలలో ఒక సురుచిర సుమాన్ని పసికట్టేయగల వ్యక్తి మహేంద్ర. ఈ వుత్తరాలు దాచలేక, పారేయలేక తన ఆఫీసులో ఒక డ్రాయరు సొరుగులో పడేసి వుంచాడు. ప్రేమలేఖలు కాని ఆ లేఖలలో ఒక హద్దు వున్నా, దూకేసిన ఒక అంచు కూడా వుంది. మూడో మనిషి చదివితే, యిద్దరి మధ్య ఏదో ఒక అనుబంధం వుందనుకునే ఆస్కారం వుంది.

ఒక ఏడాదిలోనే అహల్యకి మళ్లీ చెన్నైకి ట్రాన్స్ఫర్ అయింది. గౌతమ్ కూడా ఒక నెలలోనే బదిలీ చేయించుకుని వెళ్లిపోయాడు. మహేంద్రతో వెళ్లొస్తానని చెప్పింది అహల్య. "ఉత్తరాలు రాస్తుండండి" అన్నాడు మహేంద్ర. "చెప్పే కబుర్లు కనిపించినప్పుడు రాస్తాను" అన్నది.

ఇదంతా జరిగి నాలుగేళ్లయింది. ఆ నాలుగేళ్లలో ఏవో ఆశలు చూసుకుని మహేంద్ర ఉద్యోగం మానేశాడు. దానితో తాడు, బొంగరం లేని జీవితమైంది. సంస్కృతి అని, భాష అని, సంగీతం, డ్యాన్సు, సినీ విభావరి అంటూ సాంస్కృతిక వ్యాపారంలోకి దిగిపోయాడు. ఎవరికో ఒకరికి సన్మానం తలపెట్టడం, దానికోసం ఎవరినో ఎరవేసి యాభైవేలో, లక్షో విరాళం దండుకోవడం, సగం ఖర్చుతో ఆ కార్యక్రమం పూర్తి చేసి మిగతాది యితరులతో కలిసి పంచుకోవడం అలవాటైంది. చిన్న ప్రయత్నాల్లో విజయం పొందాక, పెద్ద కార్యక్రమాలకు దిగాడు. బొంబాయి, ఢిల్లీ, చెన్నై కళాకారులను పిలిచి అమెరికా తెలుగు వారిని పట్టుకుని చిలవలు, పలవలుగా ప్రోగ్రాములు ఏర్పాటు చేయసాగాడు. కొంతకాలం బాగానే సాగింది.

ఇతని ధోరణి బాగా అర్థమైపోయి, కొందరు వెనక్కి తగ్గారు. కొన్ని కార్యక్రమాలు బెడిసి కొట్టాయి. బహిరంగంగా పత్రికల్లోను విమర్శించారు. విశ్వసనీయత కోల్పోయే ప్రమాదంలో పడ్డాడు.

వీటన్నిటి పర్యవసానంగా డబ్బు చిక్కులు ఎక్కువ కాసాగాయి. ఎక్కడి నుంచో పుట్టించి, మరోచోట సర్దుబాటు చేసే వ్యూహం ఆలోచిస్తున్నాడు. అదీ రెండు మూడు లక్షల్లో.

అటువంటి సమయంలో హోటల్లో ఆవేపు వరసలో కూచున్న గౌతమ్‌ని గురించి మహేంద్ర మిత్రునితో అన్న మాటలవి. 'అతను నాకు బాగా తెలుసు' అని.

"ఐతే పద వెళ్లి మాటలు కలుపుదాం. ఎప్పుడో పనికి రాకపోతాడా" అన్నాడు మిత్రుడు.

"వద్దు... వద్దు... నాకు వేరే ప్లాను వుంది. ఏదీ, బిల్లు యిచ్చాడా?" అని జేబులో చెయ్యి పెట్టాడు మహేంద్ర. "నేను తీసుకున్నాలే గానీ, నీ ఆలోచనలు పసిగట్టడం నా బోటి సామాన్యుడికి సాధ్యమా? ఆ రసవత్తరమైన వుత్తరాలు నీ దగ్గరే వున్నాయా?" అని అడిగాడు. లేచి నడుస్తోంటే అడిగిన యీ ప్రశ్న మహేంద్ర వినిపించుకోలేదని గ్రహించి వూరుకున్నాడు. గౌతమ్ తమ వేపు చూడకుండానే యిద్దరు బయటికి వెళ్లి మిత్రుడి స్కూటరు ఎక్కారు.

అహల్య హెడ్డాఫీసులోనే వుందని తెలుసుకున్నాడు మహేంద్ర. ఆమెను చూడాలని మనస్సుపీకింది. బ్యాంకుకి వెళ్లి ఆమె రూము ముందున్న బోర్డు పరికించాడు. 'పెద్ద పోస్ట్!' అనుకుని, తన పేరు చీటీ మీద రాసి యిచ్చాడు. మరో యిద్దరు విజిటర్స్ తన కంటే ముందు వచ్చిన వాళ్లు వున్నారు. వాళ్లొక పది నిముషాల్లో వెళ్లిపోయారు. బెల్లు మోగింది. అటెండరు మహేంద్రను లోపలికి పంపి, స్ప్రింగు డోరు మెల్లగా మూసి బయటకు వెళ్ళాడు. ఆ రూములోని చల్లదనానికి, ఖరీదైన ఫర్నీచరు వైభవానికి అరక్షణం ముగ్ధుడైనాడు మహేంద్ర.

"హాయ్!" అంటే "హాయ్" అనుకున్నారు. నమస్కారాలు గొణిగారు.

"అహల్యా! నువ్వు మళ్లీ యిక్కడ రావడం చాలా బాగుంది" అన్నాడు మహేంద్ర. ఏకవచనం విని, కనీ కనపడనట్లు కళ్లెత్తింది అహల్య. చేతిలో ఫైలు తిరగేస్తూ, "చెప్పండి. ఎల్లా వున్నారు? ఏమి చేస్తున్నారు?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

"సంస్కృతి, వికాసం అంటూ చేస్తున్న పనులన్నీ విసుగెత్తించాయి. ప్రస్తుతం విరామం, నువ్వెల్లా వున్నావు. పిల్లలా?" అనడిగాడు. ఆమెలో ఏమి మార్పు వచ్చిందా అని పరిశీలిస్తూ...

"ఒక అబ్బాయి. ఏదైనా పని మీద వచ్చారా?" అన్నది. తన పని మాత్రం మానకుండా చూస్తూ కాగితాలు యీ ట్రే లోంచి ఆ ట్రేలోకి పడేస్తోంది. సంతకాలు పెడుతోంది.

"ఏమీ లేదు. ఊరికే దర్శనం చేసుకుందామని" అన్నాడు. ఆ మాటలో ఒక చనువు నింపేస్తూ.

"అల్లాగా?" అని మళ్లీ కాగితాలపరిశీలనలో పడింది. కాస్సేపు ఆ ధోరణి చూశాక "నువ్వు చాలా మారిపోయావు" అన్నాడు మహేంధ్ర.

ఆమె కొంచెం సీరియస్‌గా "నువ్వు అని ఏకవచనంలోకి దిగిపోయారేమిటి?" అన్నది.

మహేంద్ర ఆశ్చర్యపడిపోతూ "అదేమిటి అహల్యా! నేను ఆ మాత్రం దగ్గరి వాడిని కానా?" అన్నాడు.

"కాదు అనే అనుకుంటున్నాను. మీరు వచ్చిన పని యింతకీ చెప్పారు కారు" అంటూనే బజ్జర్ నొక్కింది. దర్జా అయిన వేషంలో వున్న ఒక ప్యూను వచ్చి రెండు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకటి మహేంద్ర ముందుంచాడు. ట్రే లోంచి ఫైల్సు తీసుకుని వెళ్లాడు.

మహేంద్ర ఎంతో తెలివిగా, సులువుగా వ్యవహరించగలననుకొన్నాడు గానీ అది అంత తేలిక

కాదనిపించింది... "సరే, నీ దగ్గర విషయం దాచడం దేనికి గానీ నాకు రెండు లక్షలు పర్సనలు లోన్ కావాలి" అన్నాడు.

"దానికేముంది? ఫారాలు తీసుకొని అప్లై చేయండి" అన్నది అహల్య.

"ఊరికే అప్లికేషన్ పడేస్తే పని జరుగుతుందని నమ్మకం లేదు. నువ్వు గట్టిగా పూనుకుంటే గాని పని కాదు అని నా అభిప్రాయం" అన్నాడు మహేంద్ర.

అహల్య పాములా పడగ విప్పబోతోందన్న భావం కలిగింది అతనికెందుకో.

"అల్లా ఎందుకనుకుంటారు? ఇది ఒక జాతీయ బ్యాంకు. రూల్సు ప్రకారం అప్పులు యివ్వడం. తిరిగి వసూలు చేసుకోవడం మా కార్యక్రమాల్లో చాలా ముఖ్యమైనవి" అన్నది.

"సరేలే! రూల్సు, చింతకాయ అంటే నీ దగ్గరకు రావడం దేనికి? ఏదో పాత స్నేహాన్ని బట్టి, అలాంటివన్నీ పెద్ద పట్టించుకోకుండా నా దరఖాస్తు చూస్తావని వచ్చాను" అన్నాడు నిశితంగా చూస్తూ.

"అల్లా చేస్తే మా ఉద్యోగాలకు ముప్పు" అన్నది.

బిగ్గరగా నవ్వి తన లౌక్యం, గడుసుదనం చాటుకుంటూ... "ఆ సంగతులన్నీ నాకు తెలియదా? అది సరేగానీ, మన పాత స్నేహం గురించి ప్రస్తావించినా... నీలో చలనం లేదేం" అన్నాడు. ఫోన్ మోగింది.

"మహేంద్రగారూ, నాకిది చాలా పని టైము" అంటూ ఫోన్ అందుకుంది. ఈ మాటకు టక్కున వెనక్కి తిరిగి లేచి స్ప్రింగు డోర్ బలంగా లాగి, వదిలి బయటకు నడిచాడు.

ఆ తర్వాత రెండురోజుల్లో దరఖాస్తు ఫారాలు తీసికొని, రెండు లక్షలు పర్సనల్ లోన్‌కి దరఖాస్తు తయారు చేశాడు. షూరిటీగా కొద్దిపాటి ఆస్తి,బాగా పరపతి ఉన్న ఒక మిత్రుడిని చూపించాడు. బ్యాంకిలోని ఉద్యోగులు చెప్పడం వలన తెలిసింది ఏమిటంటే అది సరిపోదని.. "కానీ మేడం గారిని కలవండి ఒకసారి" అన్నారు సూచాయగా. మర్నాడు కాగితాలు సెక్షనులో యిచ్చేశాడు.

తన దగ్గర ఒక కవరులో,అహల్య తనకు రాసిన ఏడెనిమిది ఉత్తరాలున్నాయి. అది తీసుకుని బయలు దేరాడు.అహల్య దగ్గర విజిటర్లు మామూలుగానే వున్నారు. అయినా చీటీ చూడగానే తనని పిలిచినట్లుంది. చనువుగా కుశల ప్రశ్నలు వేసి "నా ఫైలు నీ దగ్గరకు వచ్చిందటగా!" అన్నాడు.

ఆమెఎడం ప్రక్కన ట్రేలోంచి ఒక ఫైలు తీసింది. ఎదురుగా పెట్టుకుని గబగబా కాగితాలు చదివింది. ఆపని ఆమె చాలా నిశితంగా చూస్తూ, చేస్తోందని గమనించాడు మహేంద్ర. తన బ్యాగులోంచి అహల్య తనకు వ్రాసిన వుత్తరాలు కాని ఉత్తరాలు ప్రకృతి, ప్రణయం కలగలిసిన కాగితాలు మీది రాతలు బయటకు తీశాడు.

"ఈ వేళ సంతకం పెట్టేస్తావా?" అన్నాడు. ఆమె ఎక్కువ కదలకుండానే తల కొంచెం పక్కకు వంచింది. అది అవుననో, కాదనో గమనించకుండా... "ఎంతలే. రెండు లక్షలే!" అన్నాడు. కొంచెం ఆగి, "యిదుగో, యీ కవరు చూశావా?" అన్నాడు ఆమె చూసింది.

ఉత్తరాలు బయటికి తీసి తమాషాగా నవ్వుతూ... "చాలా హాట్‌గానే రాశావు. అప్పటి నీ మూడ్ అల్లా వుందనుకుంటాను" అన్నాడు.

ఆమె ముఖం జేవురించింది. టేబిలు మీద వున్న నీళ్లు కొద్దిగా తాగింది.

"కొంచెం నాటకీయంగా అనుకోకపోతే, నా ఫైలు మీద నీ సంతకానికీ, యీ వుత్తరాలకీ లింకు పెడదామనుకుంటున్నాను" అన్నాడు మహేంద్ర.

అహల్య సర్దుకుని కూచుని చేయి చాపింది కవరు కోసం. ఆమె ఎదురుగా వున్నది తన ఫైలే అని గుర్తించాడు. "మీ ఆయనకు తెలుగు వచ్చా?" అన్నాడు. ఆమె యీ ప్రశ్న బ్లాకు మెయిలుగా అర్థం చేసుకోవాలని అతని అంచనా...

ఆమె వూపిరి గట్టిగా వదిలి "ఆ, నేను నేర్పించాను" అన్నది.

"నా దగ్గర యింతకాలం యీ వేడి వేడి రచనలు వుంచడం వల్ల లాభం వున్నదన్నమాట" అని బిగ్గరగా నవ్వాడు.

చేతిలో వున్న పెన్ను నిదానంగా తిప్పుతోంది అహల్య. "మరి యిచ్చేయండి ఆ వుత్తరాలు నాకు" అన్నది. "ఇస్తే మరి ఒప్పందమేనా?"

అహల్య నవ్వింది. "మరి. అంతేగా?" అన్నది. అతను యివ్వబోతున్నాడు. ఆమె గబుక్కున తీసుకుని, డ్రాయరులో పడేసుకుంది.

"అబ్బో బలే స్పీడు" అన్నాడతను.

"ఊ" అన్నది అహల్య.

"రేపు మధ్యాహ్నం వరకు చెక్కు తయారైపోతుందా అహల్యా" అన్నాడతను. ఆమె చిరునవ్వు నవ్వింది. బెల్లు మోగించింది. ఇంక తన ఇంటర్వ్యూ పూర్తయిందని అర్థమైంది మహేంద్రకి.

"థాంక్యూ అహల్యా! నా దగ్గర పాము పిల్లల్లా పడి వున్నాయి ఉత్తరాలు. అక్కరకు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. ఎప్పటికైనా ఆడదానికీ, ప్రేమలేఖలకీ, కాపురాలకీ సంబంధం వుంటుందని నాకు తెలుసు. నీకు చిన్న గిఫ్టు అంతే!" అన్నాడు. ముఖాన లేని చెమటను తుడుచుకున్నాడు.

ఆ తర్వాత శనివారం. ఆదివారం వచ్చాయి. సోమవారం పన్నెండు దాటాక బ్యాంకిలో సెక్షనుకి వెళ్లాడు. "సార్! నా చెక్కు ఎప్పుడు వస్తుంది? నా సేవింగ్స్ అకౌంటులో జమ అయిపోతుందా? నేను ఏదైనా సంతకాలు పెట్టాలా?" అన్నాడు. ఆ విషయమంతా తనకి ఎంతో బాగా తెలుసున్నట్లు పోజు పెట్టకపోతే, స్టాఫ్ తనని దబాయించేస్తారని అతని అభిప్రాయం.

అసిస్టెంటు ఫైల్సు తీస్తోంటే... "అదుగో, అదే నా ఫైలు" అన్నాడు మహేంద్ర కాగితాలు గుర్తు పట్టేస్తో.

ఆ కుర్రాడు కాగితాలు తిరగేసి " శాంక్షను కాలేదు గదా సార్!" అన్నాడు.

"శాంక్షను కాలేదా?" అన్నాడు మహేంద్ర తెల్లముఖం వేసి. నీరసం అతని మాటల్లో.

"ఔను. షూరిటీల ఇన్‌కం సరిపోదు" అన్నాడు అసిస్టెంటు.

"మరి ఎల్లాగ? వెళ్లి అహల్య మేడమ్‌ని అడగమంటారా?"

"మేడం లేరు కదండీ? ఒక నెల లీవు. ఆ తర్వాత బొంబాయికి ప్రమోషను మీద వెళ్లిపోతారు" అని చెప్పాడతను.

మహేంద్ర గింజుకున్నాడు. ఏమీ పాలుపోలేదు. "అహల్య, ఎంత కిలాడి!" అనుకున్నాడు.

తను భయంకరంగా ఓడిపోయాడు. ఎదురు గోడ వంక చూస్తూ అరనిముషం కూచున్నాడు. అసిస్టెంటు తన పని తాను చేసుకుంటున్నాడు.

**(స్వప్న మాసపత్రిక)**